ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

14-02-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 47 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM



## మునిసిపల్ విజయాల వేళ

### ప్రియాంకగాంధీతో సీఎం రేవంత్ భేటీ

ఫలితాలపై అభినందించిన ప్రియాంక

**ఢిల్లీ, మహా :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ... రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు.

**టాప్ న్యూస్**


### బోణీ కొట్టిన కవిత



- వడ్డేపల్లి మునిసిపాలిటీలో సింహగర్జన
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కవిత షాక్

02


### బంగ్లా పీఠంపై తారీఖ్ రెహ్మాన్



- అభినందించిన ప్రధాని మోదీ

02

### రేవంత్ సాధించిన విజయం



- కాంగ్రెస్ కు ఊరట
- మునిసిపల్ రిజల్ట్ పై రాజ్ దీప్ సర్దేశాయ్ పోస్ట్

02



## రెబెలే కింగ్

### హైటెన్షన్ హంగ్

హైఓల్టేజ్ పాలిటిక్స్.. కిడ్నాప్ లు.. రాజకీయాలు

**హైదరాబాద్, మహా:** మునిసిపల్ ఫలితాలు వెలువడిన వేళ రెబెల్సే రాజకీయపార్టీల రాత మార్చే కింగ్స్ అయ్యారు. 30కు పైగా మునిసిపాలిటీల్లో రెబెల్స్ ఎటు చెయ్యెత్తితే వారిదే పీఠం. వారు ఉస్కో అంటే ఉస్కో. డిస్కో అంటే డిస్కో. ఈ క్రమంలో మునిసిపల్ ఫలితాలు వెలువడిన వేళ ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. అభ్యర్థులను క్యాంపులకు తరలించేందుకు ఆయా పార్టీల నాయకులు పోటీపడుతున్నారు. మిగతా 2లో

కరీంనగర్ కార్పొరేషన్‌లో 35కు చేరిన

## బీజేపీ బలం

- చక్రం తిప్పిన బండి సంజయ్
- మ్యాజిక్ ఫిగర్ దాటిన బీజేపీ
- 66 స్థానాలకుగాను 30 సొంతంగావిజయ కేతనం
- ఫలితాలు వెలువడ్డ కొద్దిసేపటికే 4 గురు ఇండిపెండెంట్లు, ఒక ఏఐఎఫ్ బి కార్పొరేటర్ బీజేపీలో చేరిక
- మరో 5 గురు కార్పొరేటర్లు చేరే అవకాశం

02

# కాంగ్రెస్‌కు పట్టణాభిషేకం

## మునిసిపల్ ఎన్నికల్లో హస్తం హవా

### రేవంత్ పాలనకు పట్టణం పట్టం

మెజారిటీ మునిసిపాలిటీల్లో జోరు.. 64 మునిసిపాలిటీల్లో హస్తం ఏకపక్షం

13చోట్ల బీఆర్ఎస్.. ఒక్క స్థానంలో బీజేపీ మ్యాజిక్ మార్క్


కార్పోరేషన్లలో కాంగ్రెస్ సత్తా.. నిజామాబాద్ లో బీజేపీకి షాక్

38 మునిసిపాలిటీల్లో హంగ్.. రెబెల్స్ చేతిలో రాజకీయం

కొత్తగూడెంలో సత్తా చాటిన సీపీఐ.. కాంగ్రెస్ మద్దతిచ్చే అవకాశం



**హైదరాబాద్ - మహా:** తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ, రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు తమకే పట్టం కట్టారని నిరూపించుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను, కాంగ్రెస్ పార్టీ ఏకంగా 64 చోట్ల విజయం సాధించి జెండా ఎగరేసింది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. బిజెపి ఒక్క నారాయణపేట మునిసిపాలిటీని కైవసం చేసుకుంది. మిగతా 2లో




## రెండేళ్ళ ప్రజాపాలనకు సంపూర్ణ ఆమోదం

### పుర ఫలితాలపై సీఎం రేవంత్ హర్షం

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు.. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలనకు సంపూర్ణ ఆమోదంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారన్న రేవంత్... ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమన్నారు. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమన్నారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని పేర్కొన్నారు.

## 75 శాతం మునిసిపాలిటీలు గెలిచాం

- ప్రజాప్రభుత్వంపై ప్రజల సంతృప్తి ఇది
- గ్రేటర్ హైదరాబాద్ లోనూ ఇదే రిపీట్ చేస్తాం
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ధీమా



**నిజామాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం పట్ల, ప్రజా ప్రభుత్వ సుపరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనడానికి మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 75 శాతానికి పైగా మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని, కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగానే పరిపాలన కొనసాగిస్తామని హామీ ఇస్తున్నాం. కరీంనగర్, నిజామాబాద్ లలో బీజేపీ ఎంత మతవిద్వేషాలు రెచ్చగొట్టినా ప్రజలు పూర్తి మెజారిటీ ఇవ్వలేదన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కూడా 75 శాతానికి పైగా ఫలితాలు సాధిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు, కాంగ్రెస్ విధానాలకు ఇది ప్రజలు అందించిన విజయమన్నారు.

## భాజపా బలపడింది

### ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించాం.. బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు



**హైదరాబాద్, మహా :** ఈ ఎన్నికల్లో భాజపా బలపడిందని, ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. "ఫలితాల్లో 250కుపైగా వార్డుల్లో గెలిచాం. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా 6 మున్సిపాలిటీల్లో భాజపా నిలిచింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లు కైవసం చేసుకోబోతున్నాం. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్‌లో మా పార్టీ అభ్యర్థులే ఛైర్మన్లు అవుతారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్రుల మద్దతుతో ఛైర్మన్ పదవులు దక్కించుకుంటాం. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భాజపా ఆశించిన మేరకే ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఫలితాలు ఆశాజనకంగా రాలేదు. మొత్తం వార్డులు, డివిజన్లు కలిపి 350 సీట్లు గెలుస్తున్నాం. త్రిముఖ పోరులో భాజపాకు కొంత నష్టం వాటిల్లింది. మిగతా 2లో

## భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

- కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం మేమే
- మున్సిపల్ పలితాలపై కేటీఆర్ కీలక ప్రకటన
- కొత్తగూడెం మునిసిపాలిటీలో సీపీఐకి బీఆర్ఎస్ మద్దతు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించిందని కేటీఆర్ సంతృప్తి వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అధికార కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీకి దక్కిన నిజమైన విజయం కాదని, ఇది కేవలం అధికార బలంతో, పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని సాధించిన కృత్రిమ గెలుపు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బు, మద్యాన్ని విచ్చలవిడిగా ప్రవహింపజేసిందని, కానీ ప్రజల మనసులను గెలవడంలో మాత్రం ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ కేటీఆర్ కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు. మొత్తం 2,581 మున్సిపల్ వార్డులలో బీఆర్ఎస్ సుమారు 750 వార్డులను గెలుచుకుందని, ఇది దాదాపు 30 శాతానికిపైగా సీట్లని ఆయన గుర్తు చేశారు. మిగతా 2లో

ANN తెలుగు
మహా పత్రిక 02
శనివారం, తిరుపతి | 14-02-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# కాంగ్రెస్‌కు పట్టాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డుల్లో ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,347 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 64 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్‌ఎస్ 717 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 13 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది. బీజేపీ 261 వార్డుల్లో గెలుపొందారు. ఒక నారాయణపేట మునిసిపాలిటీ దక్కించుకంది. స్వతంత్ర అభ్యర్థులు.. 256 వార్డుల్లో విజయం సాధించారు.

**హంగే.. కింగ్**

ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం హంగ్ ఫలితాలు. సుమారు 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. రెబెల్స్ చేతిలోనే 30 శాతానికి పైగా మునిసిపాలిటీల రాజకీయం ఆధారపడి ఉంది. మున్సిపాలిటీలతో పాటు ఏడు కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ సాధించగా, మహబూబ్‌నగర్‌లో పట్టు నిలుపుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. ఈ క్రమంలో మేయర్ పదవి సీపీఐకు దక్కనుంది. మరోవైపు, బీజేపీ తమకు బలమైన పట్టున్న నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు ప్రాంతాలు బీజేపీ సిట్టింగ్ లోక్‌సభ స్థానాలు కావడం గమనార్హం. అయితే మెజారిటీ మార్క్ కు 2 సీట్ల దూరంలో ఆగిపోయింది. నిజామాబాద్ లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ కార్పొరేషన్ కైవసం చేసుకోనుండగా, కరీంనగర్ బీజేపీకే మేయర్ పీఠం దక్కే అవకాశాలున్నాయి.

# రెబెలే కింగ్.. హైటెన్షన్ హంగ్

## హైఓల్టేజ్ పాలిటిక్స్.. కిడ్నాప్ లు.. రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్లు, పురపాలికల్లో పలుచోట్ల మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో మేయర్ , చైర్మన్ పీఠాలే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. మరోవైపు ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే ఆయా పార్టీలు తమ అభ్యర్థులను క్యాంపులకు తరలిస్తున్నారు. తమ అభ్యర్థులు ప్రలోభాలకు లొంగకుండా తమ ఆధీనంలో ఉండే విధంగా ఆయా పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. ఈ క్రమంలోనే సంగారెడ్డి, నిజామాబాద్, సూర్యాపేట, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. జనగామ, ఆసిఫాబాద్ లలో ఇండిపెండెంట్ అభ్యర్థుల కోసం హైటెన్షన్ రాజకీయాలు నెలకొన్నాయి. ఆసిఫాబాద్ లో కౌంటింగ్ జరుగుతుండగాన ఓ స్వతంత్ర అభ్యర్థిని కిడ్నాప్ చేశారు. జనగామలో హైటెన్షన్ ఘర్షణ నెలకొంది. ఆదిలాబాద్ టో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కూడా క్యాంపు రాజకీయాలు చేస్తున్నాయి.

**జోరందుకున్న క్యాంపు రాజకీయాలు**

ఎన్నికల ఫలితాల వేళ క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలోనే సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. స్వతంత్ర అభ్యర్థులను క్యాంపులకు తరలించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పోటీపడ్డారు. ఇస్నాపూర్‌లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ దక్కకపోవడంతో చైర్మన్ పీఠంకోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పోటీపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ మొత్తం 26 వార్డులకు 10 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా, బీఆర్‌ఎస్ 12, స్వతంత్రులు నాలుగు వార్డుల్లో విజయం సాధించారు. దీంతో స్వతంత్రులను శిబిరాలకు తరలించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు పోటీపడ్డారు. ఈ క్రమంలోనే ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులను బీఆర్‌ఎస్ నేతలు తీసుకెళ్లారు. ఇస్నాపూర్‌లో ఓ ఇండిపెండెంట్ అభ్యర్థిని కాంగ్రెస్ నేతలు తరలించే క్రమంలో బీఆర్‌ఎస్ నేతలు అడ్డుతగడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

**మెజార్టీ ఉన్నా క్యాంపునకు తరలింపు :**

సూర్యాపేట పురపాలికలో తమ పార్టీ తరపున విజయం సాధించిన 31 మంది కౌన్సిలర్లను కాంగ్రెస్ నాయకులు క్యాంపునకు తరలించారు. చైర్మన్ ఎన్నిక పూర్తయ్యేంతవరకు ఫిరాయింపులకు పాల్పడకుండా ఉండేందుకే ఆ పార్టీ నేతలు ముందస్తు చర్యలను చేపట్టారు. అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీల బేరసారాలకు లొంగకుండా, తమ ఆధీనంలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జనగామలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత తలెత్తింది. హంగ్ ఏర్పడటంతో స్వతంత్ర అభ్యర్థి మద్ధతు కోసం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిని తీసుకువెళ్లేందుకు రెండు పార్టీల శ్రేణులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తనకు చైర్మన్ పదవి ఇస్తేనే ఏ పార్టీకైనా మద్ధతు ఇస్తానని స్వతంత్ర అభ్యర్థి ప్రకటించారు.

**నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో క్యాంపు రాజకీయాలు**

నిజామాబాద్ కార్పొరేషన్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ అభ్యర్థులను హైదరాబాద్‌కు తరలించినట్లుగా తెలిసింది. ఆదిలాబాద్ జిల్లాలో క్యాంపు రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే జోగురామన్న, కాగజ్‌నగర్‌లో కోనేరు కోనప్ప, క్యాతన్‌పల్లిలో బాల్కసుమన్‌ల పర్యవేక్షణలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఇప్పటికే రహస్య ప్రాంతాలకు తరలించినట్లుగా తెలిసింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన క్యాంపు ఆఫీస్ నకు గురువారమే అభ్యర్థులను పిలిపించి ప్రత్యేక బస్సుల్లో వారిని వేరే చోటుకు తరలించారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి గురువారమే కాంగ్రెస్ నుండి పోటీచేసిన అభ్యర్థులను ప్రత్యేక బస్సుల్లో వేరే ప్రాంతాలకు తరలించారు. బీజేపీకి ఆదిలాబాద్ లో మెజారిటీ రాకపోగా, బీజేపీకి వ్యతిరేకంగా ఇతర శక్తులు కలిసి బల్దియా దక్కించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## కరీంనగర్ కార్పొరేషన్‌లో 35కు చేరిన బీజేపీ బలం

**కరీంనగర్, మహా:** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటింది. మొత్తం 66 స్థానాలకు గాను బీజేపీ సొంతంగా 30 స్థానాలను కైవసం చేసుకుంది. ఫలితాలు వెలువడిన వెంటనే 13వ డివిజన్ నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా విజయం సాధించిన తెల్ల లక్ష్మీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోట చేసి గెలిచిన విపల సాయి జ్యోతి బీజేపీలో చేరారు. వీరిద్దరూ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఆ తరువాత కొద్ది సేపటికే ఇద్దరు బీజేపీ రెబల్ కార్పొరేటర్లు, మరో ఇండిపెండెంట్ సైతం సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకుని బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. దీంతో బీజేపీ సంఖ్య 35కు చేరుకుంది. వాస్తవానికి కరీంనగర్ కార్పొరేషన్ కార్పొరేటర్ల సంఖ్య 66. వీరితోపాటు స్థానిక ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్(బీఆర్‌ఎస్) కవ్వంపల్లి సత్యనారాయణ(కాంగ్రెస్), ఎంపీ బండి సంజయ్ (బీజేపీ) ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో మొత్తం సభ్యుల సంఖ్య 69కి చేరనుంది. ఈ లెక్కన మ్యాజిక్ ఫిగర్ 35 కావాలి. బీజేపీ ఇప్పటికే 35కు చేరుకుంది. అవసరమైతే మరో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య సైతం అవసరమైన పక్షంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే ఆ అవసరం పడే అవకాశాలు కన్పించడం లేదు. ఎందుకంటే మరో 5 గురు ఇండిపెండెంట్, ఏఐబీపీ తరపున గెలిచిన కార్పొరేటర్లు బీజేపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. శనివారం వారంతా బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరనున్నారు.

## భాజపా బలపడింది

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఒక డివిజన్, అశ్వారావుపేటలో ఒక వార్డు గెలిచాం. కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితాలు రాలేదు.. అనేక చోట్ల హాంగ్ వచ్చింది. తెలంగాణ ప్రజలు మంచి తీర్పు ఇచ్చారు. భాజపాను ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, మజ్లీస్ కలిసి పని చేశాయి. అందుకే బీఆర్‌ఎస్ ఇన్ని సీట్లు గెలవగలిగింది. హాంగ్ వచ్చిన చోట భాజపా ఎవ్వరికీ మద్దతు ఇవ్వదు. హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో భాజపా బలంగా ఉంది. తెలంగాణ ప్రజలు భాజపాను విశ్వసిస్తున్నారు. కచ్చితంగా అధికారంలోకి వస్తాం. మేం ఎవ్వరికీ మద్దతు ఇవ్వం. కానీ మాకు ఎవరైనా మద్దతు ఇస్తామంటే తీసుకుంటాం'' అని రామచందర్‌రావు తెలిపారు.

## కాంగ్రెస్ ఖాతాలో 94 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లు

- అభివృద్ధి, సంక్షేమానికి పట్టణ ప్రజల పెద్దపీట
- రెండు కార్పొరేషన్లలో హంగ్
- బీఆర్‌ఎస్, బిజెపి కట్టు కథలను ప్రజలు నమ్మలేదు
- అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం
- గాంధీభవన్ ప్రెస్ మీట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమ అవుతాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించింది మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడింది అన్నారు. అక్కడ బిజెపి, కాంగ్రెస్, ఇండిపెండెంట్ లు ఉన్నారన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయం అన్నారు. అభివృద్ధి ,సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీటవేశారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని ఈ ఫలితాలతో తేటతెల్లమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని బిఆర్‌ఎస్, బిజెపి నేతలు ప్రతిరోజు గాలి కబుర్లు చెబుతూ కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పైన కాంగ్రెస్ పార్టీ పైన చేస్తున్న విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పును ఇచ్చారని అన్నారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగిందని, అత్యున్నత ప్రమాణాలతో పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఈ ఫలితాలతో స్పష్టమైందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రసారమాధ్యమాల్లో కనిపించాలని, ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని ప్రతిపక్షాలు కట్టు కథలు అల్లడం, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలనీ డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని ప్రజాస్వామ్య వాదిగా తాను బలంగా కోరుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు. సంపూర్ణ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టణ ప్రజలూ కాంగ్రెస్ వెంటే

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మహా :** పుర పోరులో కాంగ్రెస్ పార్టీ 75 శాతం మున్సిపాలిటీలను దక్కించుకుందని, పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ వెంటే ఉన్నారని స్పష్టమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ ఎన్నికలతో బీఆర్‌ఎస్ బలమేంటో తేలిపోయిందన్నారు.



శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో

## పుష్పోత్సవ్ ప్రదర్శన

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్ జి ఐ ఏ ) ప్రత్యేక పుష్ప ప్రదర్శన రెండో ఎడిషన్ ను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ (గెల్) సీఈవో ప్రదీప్ పాణికర్ శుక్రవారం పుష్పోత్సవ్ 2026ను ప్రారంభించారు. ఈ పుష్ప ప్రదర్శన 2026 ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు విమానాశ్రయంలోని ఏరో ప్లాజాలో నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో థీమ్ ఆధారిత పుష్ప అలంకరణలు, ఇకెబానా బోన్సాయ్ ఏర్పాట్లు, వివిధ పోటీ విభాగాలు, ఉద్యానవనానికి సంబంధించిన ఉత్పత్తుల విక్రయాలు జరగనున్నాయిని తెలిపారు. కళ, ప్రకృతి, డిజైన్‌ల సమ్మేళనంగా సందర్శకులకు మరిచిపోలేని పుష్పానుభూతిని ఈ ప్రదర్శన అందించనుందన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోణీ కొట్టిన కవిత

**గద్వాల, మహా :** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తుండగా.. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీ రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. వడ్డేపల్లి మున్సిపాలిటీని కవిత సహకారంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున స్వీప్ చేశారు.. ఇతర చోట్ల కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతుంటే, వడ్డేపల్లిలో మాత్రం ఫలితం విభిన్నంగా వచ్చింది. ఇక్కడి ఓటర్లు అందరి అంచనాలను తలకిందులు చేస్తూ వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి విజయాన్ని అందించారు. మొత్తం 10 వార్డులు ఉన్న ఈ మున్సిపాలిటీలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించి తమ సత్తా చాటారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కేవలం ఒక్కో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కవిత మద్దతుదారులు ఈ ఒక్క స్థానంలో ఓటర్లను మెప్పించారు.

**కవిత ఎఫెక్ట్.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు షాక్..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పార్టీల హవా కొనసాగుతున్న తరుణంలో, ఒక చిన్న పార్టీ ఈ స్థాయిలో మెజారిటీ సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఈ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు మద్దతు తెలిపారు. దాంతో ఇక్కడ ఫలితాల్లో సీన్ రివర్స్ అయింది. అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ఎజెండాగా బరిలోకి దిగిన ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రధాన పార్టీలను కాదని, స్థానికంగా అందుబాటులో ఉండే నేతలకే ఓటర్లు పట్టం కట్టారు. ఈ విజయంతో వడ్డేపల్లిలో ఫార్వర్డ్ బ్లాక్ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించాయి. ఈ ఫలితం రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు ఒక విభిన్నమైన సందేశాన్ని పంపినట్లయ్యింది.

## బంగ్లా పీఠంపై తారీఖ్ రెహ్మాన్

**అభినందించిన ప్రధాని మోదీ**

**మహా :** బంగ్లాదేశ్‌లో దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడొంతుల మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. 60 ఏళ్ల తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా దేశ పగ్గాలు అందుకోనున్నారు. ఒకప్పుడు విమర్శకుల చేత 'డార్క్ ప్రిన్స్'గా మాటలు పడిన రహ్మాన్ కు ఈ విజయం ఓ కొత్త ఆరంభమే. ఈ ఫలితాలపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ రహ్మాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లా లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం, ఉమ్మడి లక్ష్యాలపై ముందుకువెళ్లేందుకు మీతో (తారిఖ్ నేతృత్వంలోని ప్రభుత్వం) కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం'' అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

# భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ 40 శాతానికి పైగా ఓటు బ్యాంకును నిలబెట్టుకుందని, దీనిని బట్టి క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ బలం తగ్గలేదని స్పష్టం చేశారు. మా విజయంతో కాంగ్రెస్ నేతల నోళ్లు మూతపడ్డాయంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్‌లను నిలువరించే ఏకైక శక్తి**

కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఎదుర్కోగలిగే శక్తి కేవలం బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని కేటీఆర్ అన్నారు. సింగరేణి ప్రాంతంలో బీజేపీని అడ్డుకోవడానికి తాము సీపీఐతో కలిసి పని చేస్తామన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ లో సీపీఐకి షరతుల్లేకుండా మద్దతిస్తామన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ వైపు నెడుతున్న బీజేపీకి, దానికి సహకరిస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల ఫలితాలు ఒక హెచ్చరిక అని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై ఆధారాలు చూపినా, సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ ఎందుకు కాపాడుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**జీహెచ్‌ఎంసీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలే టార్గెట్**

ఈ మున్సిపల్ ఫలితాలను పునాదిగా చేసుకుని రాబోయే జీహెచ్‌ఎంసీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సమరోత్సాహంతో వెళ్తామని కేటీఆర్ ప్రకటించారు. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో అధికార పార్టీ చేసే ప్రలోభాలను అడ్డుకుంటామని, అక్కడ ఏం జరుగుతుందో వేచి చూడాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితుల్లో కూడా సైనికుల్లా పోరాడిన బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్స్ కి కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, మరింత ఉత్సాహంతో ప్రజల పక్షాన పోరాడుతామన్నారు.

## రేవంత్ సాధించిన విజయం

**ఢిల్లీ, మహా :** గత 12 నెలల్లో ఎన్నికల పరంగా కాంగ్రెస్ పార్టీకి దేశంలో పెద్దగా సంబరపడే విజయాలు లభించలేదు. అలాంటి సమయంలో తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయం, పార్టీ యువతరం నాయకుల్లో రేవంత్ రెడ్డి స్థిరంగా ఎదుగుతున్న నాయకత్వాన్ని మరింత బలపరుస్తోంది. దక్షిణ భారతంలో కాంగ్రెస్‌కు కొంత ఊరటనిచ్చిన ఫలితంగా ఇది భావించవచ్చు అంటూ ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ రేవంత్ ను ప్రశంసిస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# పాలమూరులో కాంగ్రెస్ పైచేయి

## 18లో 11 కాంగ్రెస్

**మహా నెట్ వర్క్**



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌పై చేయి సాధించింది. అత్యధిక మున్సిపాలిటీలను దక్కించుకుంది. మొత్తం 18 పురపాలికల్లో 11 పీఠాలను కైవసం చేసుకుంది. బీఆర్‌ఎస్, ఫార్వార్డ్ బ్లాక్ చెరో మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. భూత్పూర్, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, ఆత్మకూర్, కొత్తకోట, పెబ్బేరు, వనపర్తి, కోస్గి, మద్దూరు, మక్తల్ పులపాలికల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అయిజా పురపాలికను బీఆర్ ఎస్ దక్కించుకోగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఫార్వార్డ్ బ్లాక్ పాగావేసింది. దేవరకద్ర, అమరచింత, అలంపూర్, గద్వాల్‌లో హంగ్ ఫలితాలు వచ్చాయి. నారాయణపేట మున్సిపాలిటీలో బీజేపీ ఎక్కువ వార్డుల్ని గెలుచుకుంది.

**కాంగ్రెస్ ప్రభంజనం**

మహబూబ్ నగర్ జిల్లాలోని 2 మున్సిపాలిటీలనూ కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. కాగా రెండింటిలోనూ మొత్తం 22 స్థానాల్లో 13 వార్డులను కైవసం చేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలనూ కాంగ్రెస్ చేజిక్కించుకుంది. మొత్తం 65 వార్డులకు గానూ 47 స్థానాల్లో జెండా పాతింది. వనపర్తిజిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 4 స్థానాలను కైవసం చేసుకుంది. కాగా అమరచింత మున్సిపాలిటీలోని మూడు ప్రధాన పార్టీలు సరిసమానంగా నిలిచాయి. జిల్లాలో మొత్తం 80 వార్డులు ఉండగా వాటిలో కాంగ్రెస్ 46 వార్డులను హస్తగతం చేసుకుంది.

**వడ్డేపల్లిలో వండర్**

జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 4 మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో గద్వాలలో 37 స్థానాలకు కాంగ్రెస్ 16, కాంగ్రెస్ 11 స్థానాలు గెలుచుకున్నాయి. ఇక్కడ 3 సీట్లు సాధించిన స్వతంత్రులు కీలకంగా మారారు. అయిజ బీఆర్ ఎస్ ఖాతాలో పడగా, అలంపూర్‌లో కాంగ్రెస్ , బీఆర్ఎస్‌లు చెరో సగం సీట్లను కైవసం చేసుకున్నాయి. వడ్డేపల్లిలో స్థానాన్ని ఫార్వార్డ్ బ్లాక్ గెలుపొందింది. నారాయణ పేట జిల్లాలో మొత్తం నాలుగు మున్సిపాలిటీలు ఉండగా వాటిలో మక్తల్, కోస్గి, మద్దూరు స్థానాలను కాంగ్రెస్ గెలవగా, నారాయణపేటలో అత్యధిక స్థానాలు బీజేపీ దక్కించుకుంది. అయితే చైర్మన్ పీఠం దక్కాలంటే ఇంకా 2 సీట్లు అవసరం.

**మహబూబ్‌నగర్ జిల్లాలో**

జిల్లాలోని భూత్పూర్ పది వార్డులకు గానూ 7 స్థానాల్లో కాంగ్రెస్ నిలదొక్కుకోగా, బీజేపీ 2 స్థానాల్లో గెలిచింది. కాగా బీఆర్‌ఎస్ కేవలం ఒకే వార్డుతో సరిపెట్టుకుంది. దేవరకద్రలోని 12 వార్డులకు గానూ కాంగ్రెస్ సగం స్థానాలను కైవసం చేసుకుంది. బీఆర్‌ఎస్ 4 వార్డుల్లో నిలదొక్కుకుంది. బీజేపీ, ఇతరులు చెరొక్క స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అంటే ఏఒక్క పార్టీకి కూడా మ్యాజిక్ ఫిగర్ దక్కకపోవడం గమనార్హం.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో :**

జిల్లాలో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో నాగర్‌కర్నూల్‌లో అత్యధికంగా 24 వార్డులు ఉండగా వాటిలో 18 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా బీఆర్‌ఎస్ 6 వార్డుల్లో గెలిచింది. జిల్లాలోని కల్వకుర్తిలో 22 వార్డులు ఉండగా వాటిలో అత్యధికంగా కాంగ్రెస్ 13 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ 5 స్థానాల్లో నిలదొక్కుకోగా బీఆర్ 3 స్థానాలతో సరిపెట్టుకుంది. ఇతరులు ఒకే స్థానంలో విజయంసాధించారు. జిల్లా మొత్తంలో ప్రధాన పార్టీల నుంచి కాకుండా ఇతర వ్యక్తి ఒక్కరే గెలవటం గమనార్హం. తర్వాత కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డుల్లో 16 స్థానాల్లో విజయం సాధించగా బీఆర్‌ఎస్ కేవలం 3 స్థానాలకే పరిమితమైంది.

**వనపర్తి జిల్లాలో :**

వనపర్తిజిల్లాలోని 5 మున్సిపాలిటీలు ఉన్నాయి. వనపర్తి మున్సిపాలిటీలో అత్యధికంగా 33 వార్డులు ఉండగా వాటిలో 20 స్థానాల్లో కాంగ్రెస్‌కు విజయం వరించింది. అయితే బీఆర్‌ఎస్ 8 స్థానాల్లో గెలుపొందింది. ఇతరులు 3 స్థానాల్లో గెలవగా, బీజేపీ రెండు స్థానాలతో సరిపెట్టుకుంది. కొత్తకోటలో 15 స్థానాలకుగానూ 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. బీఆర్ ఎస్ కేవలం 3 స్థానాలలోనే నిలిచింది. అయితే బీజేపీ, ఇతరులు చెరో స్థానంతో సరిపెట్టుకున్నారు. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉండాగ 7 స్థానాలలో కాంగ్రెస్ గెలిచింది. అయితే బీఆర్ ఎస్ 5 స్థానాల్లో గెలిచి గట్టిపోటీ ఇచ్చింది. ఆత్మకూరు మున్సిపాలిటీలోని 10 స్థానాలకు కాంగ్రెస్ 6 వార్డులలో సత్తాచాటింది. బీజేపీ 3 స్థానాల్లో విజయం నమోదు చేసుకోవడం గమనార్హం. బీఆర్‌ఎస్ కేవలం ఒకే స్థానానికి పరిమితమైంది. అమరచింతలోని 10 స్థానాల్లో వింతైన ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ చెరో మూడు స్థానాలతో సరిసమానంగా నిలిచాయి. వీరితో పాటు ఇతరులు మరో స్థానంలో గెలిచారు.

**నారాయణపేట జిల్లాలో :**

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో అత్యధికంగా 24 వార్డులు ఉండగా దీనిలో బీజేపీ పైచేయి సాధించడం విశేషం. ఇక్కడా బీజేపీకి ఏకంగా 11 స్థానాల్లో గెలుపొందగా కాంగ్రెస్ 7 స్థానాల్లో విజయం సాధించింది. ఇతరులు 4 స్థానాలను కైవసం చేసుకోగా బీఆర్‌ఎస్ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. కోస్గి మున్సిపాలిటీలో 16 వార్డులు ఉండగా కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. మద్దూరులోని 16 వార్డులకు గానూ కాంగ్రెస్ 9 స్థానాల్లో నిలదొక్కుకోగా బీఆర్ ఎస్ 6 స్థానాలతో సరిపెట్టుకుంది. ఇతరులు కేవలం ఒకే స్థానంతో నిలిచారు. మక్తల్‌లోనూ అధికార పార్టీ జయకేతనం ఎగురవేసింది.

## మ్యాజిక్ ఫిగర్ దక్కని మున్సిపాలిటీలు ఇవే ...

- ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డుల్లో బీఆర్‌ఎస్ 9, కాంగ్రెస్ 7, ఇతరులు 4
- ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని 49 వార్డులలో బీజేపీ 21, కాంగ్రెస్ 11, కాంగ్రెస్ రెబెల్స్ 5, బీఆర్‌ఎస్ 6, ఎంఐఎం 6
- మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులో కాంగ్రెస్ 7, బీఆర్‌ఎస్ 10, బీజేపీ 1, ఇతరులు 4
- వనపర్తి జిల్లా అమరచింతల : 10 వార్డుల్లో కాంగ్రెస్ 3, బీఆర్‌ఎస్ 3, బీజేపీ 3, ఇతరులు 1
- మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర : 12 వార్డుల్లో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 4, బీజేపీ 1, ఇతరులు 1
- జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ : 10 వార్డుల్లో కాంగ్రెస్ 5, బీఆర్‌ఎస్ 5
- నల్గొండ జిల్లా దేవరకొండ మున్సిపాలిటీ : 20 వార్డుల్లో కాంగ్రెస్ 10, బీఆర్‌ఎస్ 7, బీజేపీ 1, ఇతరులు 2
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ : 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్‌ఎస్ 8
- సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపాలిటీ : 16 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్‌ఎస్ 5, బీజేపీ 1, ఇతరులు 2
- సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాలిటీ : 28 వార్డుల్లో కాంగ్రెస్ 13, బీఆర్‌ఎస్ 5, బీజేపీ 8, ఇతరులు 2
- కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలో : 30 వార్డుల్లో కాంగ్రెస్ 10, బీఆర్‌ఎస్ 12, బీజేపీ 4
- మేడ్చల్ జిల్లా ఆలియాబాద్ మున్సిపాలిటీ : 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్‌ఎస్ 7, బీజేపీ 3
- గద్వాల మున్సిపాలిటీలో 37 వార్డులో కాంగ్రెస్ 16, బీఆర్‌ఎస్ 11, బీజేపీ 7
- జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులో కాంగ్రెస్ 12, బీఆర్‌ఎస్ 13, ఇతరులు 5
- సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపాలిటిలో 20 వార్డులో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 8, బీజేపీ 4, ఇతరులు 2
- మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 వార్డులో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 5, బీజేపీ 4
- జగిత్యాల జిల్లాలో రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డులో కాంగ్రెస్ 3, బీఆర్‌ఎస్ 3, బీజేపీ 5, ఇతరులు 1 విజయం సాధించారు.
- సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ మున్సిపాలిటీలో 37 వార్డులో కాంగ్రెస్ 14, బీఆర్‌ఎస్ 15, బీజేపీ 3, ఇతరులు 5. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులో కాంగ్రెస్ 14, బీఆర్‌ఎస్ 14, బీజేపీ 1, ఇతరులు 5. ఇంద్రేశం మున్సిపాలిటీలో 18 వార్డులో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 9, బీజేపీ 2, ఇతరులు 1. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీలో 12 వార్డుల్లో బీఆర్‌ఎస్ 6, కాంగ్రెస్ 5, ఇతరులు 1



## త్వరలో మంత్రినవుతా...

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**మునుగోడు, మహా:** నాకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలో మంత్రి పదవి ఇయ్యాలని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను త్వరలో మంత్రిని అవుతా. చేయకపోతే సూటి ముఖ్యమంత్రి పదవికే పెడతా. మీరు మునుగోడు చూసుకోండి నేను తెలంగాణను చూసుకుంటా. మర్యాదగా నాకు ఇచ్చినమాట ప్రకారం మంత్రి పదవి ఇవ్వండి, లేకపోతే నేనేలాక్కుంటా అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునిసిపల్ విజయోత్సవాల వేళ హాట్ కామెంట్స్ చేశారు.

# ఆదిలాబాద్‌లో హంగ్ పాలిటిక్స్

## ఆరు మునిసిపాలిటీల్లో హంగ్

- ఆదిలాబాద్ లో మెజారిటీ సాధించలేకపోయిన బీజేపీ
- నిర్మల్ లో బీజేపీకి కాంగ్రెస్ కు షాక్.. భైంసా, కాగజ్ నగర్ లోనూ ఇదే సీన్
- నలుగురు ఎమ్మెల్యేలకు ప్రజల షాక్

(మహా నెట్ వర్క్ )



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పురపోరులో మిశ్రమ ఫలితాలే ఎక్కువ వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 10 మున్సిపాలిటీలు ఉండగా నిర్మల్, చెన్నూరు, లక్షెట్టిపేట్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బిజెపి మెజారిటీ మార్క్ కు నాలుగు సీట్ల దూనంలో ఉండిపోయింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్, క్యాతనపల్లి, బెల్లంపల్లి, భైంసా, ఖానాపూర్‌లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. భైంసాలో రెబల్స్ హవా : ఆదిలాబాద్ మున్సిపాలిటీలో బీజేపీ ప్రధానపార్టీగా అవతరించినా మెజారిటీ సాధించలేకపోయింది.మొత్తం 49 వార్డులకు గాను బీజేపీ 21 స్థానాల్లో విజయభేరీ మోగించింది. 11 కాంగ్రెస్, 6 బీఆర్ఎస్ గెలుచుకోగా, ఐదు వార్డులు కాంగ్రెస్ రెబెల్స్, ఆరు వార్డులు ఎంఐఎం సాధించాయి. నిర్మల్ జిల్లాలోని నిర్మల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పరమైంది. ఇక్కడ 42 స్థానాలకు గాను 24 స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. బీజేపీ 13, బీఆర్ఎస్ 2 స్థానాలతో సరిపెట్టుకున్నాయి. స్వతంత్రులు 3 చోట్ల గెలిచారు. భైంసా మున్సిపాలిటీలో రెబల్స్ హవా నడిచింది. పార్టీ టికెట్ ఇవ్వనివారు స్వతంత్రులుగా పోటీ చేసి ఏకంగా 19 వార్డుల్లో గెలుపొందారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఒక్క వార్డుతోనే సరిపెట్టుకుంది. 6 వార్డుల్లో బీజేపీ విజయం సాధించింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో ఎవరికి స్పష్టమైన మెజార్టీ రాలేదు. 12 వార్డులకు గాను కాంగ్రెస్ 3, బీఆర్ఎస్, బీజేపీ చెరో 4 స్థానాల్లో విజయం సాధించాయి. ఒక స్వతంత్ర్య అభ్యర్థి కూడా గెలుపొందారు.

**ఆసిఫాబాద్ జిల్లాలో హంగ్**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. మొత్తం 20 వార్డుల్లో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. మొత్తం 30 వార్డులకు గాను కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 10 స్థానాలతో సరిపెట్టుకున్నారు. ఇక్కడ 5 వార్డుల్లో బీజేపీ, ఇతరులు 5 వార్డులను గెలుపొందారు.

**మంచిర్యాల జిల్లాలో**

మంచిర్యాల జిల్లాలో 4 మున్సిపాలిటీలు ఉండగా మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా, అందులో 14 వార్డులను కాంగ్రెస్, 14 బీఆర్ఎస్ గెలుచుకొని హంగ్ ఫలితాలు సాధించాయి. ఒక స్థానంలో బీజేపీ, స్వతంత్రులు 5 వార్డుల్లో గెలుపొందారు. చెన్నూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో పడింది. 18 వార్డుల్లో పదకొండు కాంగ్రెస్, 4 బీఆర్ఎస్ , 2 బీజేపీ, ఇతరులు ఒక వార్డును గెలుపొందారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ ఏ పార్టీకి దక్కలేదు. 22 వార్డుల్లో కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 10, ఒక బీజేపీ, ఇతరులు 4 వార్డులు గెలుచుకున్నారు. లక్షెట్టిపేట్ పురపోరులో కాంగ్రెస్ సత్తా చాటింది. మొత్తం 15 వార్డులకు గాను 11 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపొందింది. 3 వార్డులను బీఆర్ఎస్ గెలుచుకోగా ఒక వార్డును బీజేపీ కైవసం చేసుకుంది.

## చెన్నూరు నియోజకవర్గంలో

# మంత్రి వివేకానందకు షాక్

### క్యాతన్ పల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జండా

### తన నియోజకవర్గంలో సత్తా చాటుకున్న మాజీ ఎమ్మెల్యే సుమన్

**మందమర్రి, మహా :** చెన్నూరు నియోజకవర్గంలో కార్మిక శాఖ మంత్రి వివేకానందకు షాక్ తగిలింది. శుక్రవారం వెల్లడైన మున్సిపాలిటీ ఎన్నికలలో 10 కౌన్సిలర్ వార్డులను గెలిచి సత్తా చాటింది. అయితే ఈ ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలు సంయుక్తంగా ఎన్నికల బరిలో నిలిచాయి. అయితే ఈ పొత్తులో భాగంగా సిపిఐ పార్టీకి 7 కౌన్సిలర్ సీట్లను కేటాయించగా మరో 15 స్థానాలలో బీఆర్ఎస్ పోటీ చేసింది. నేడు సింగరేణి ఎం సి ఓ క్లబ్ లో వెల్లడైన స్థానాలలో బీఆర్ఎస్ 10, సిపిఐ 4, కాంగ్రెస్ పార్టీకి 7, ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఈ ఎన్నికలకు క్రితం పాలక కాంగ్రెస్ పార్టీకి, సిపిఐ పార్టీకి పొత్తు ఉన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు పలుమార్లు స్థానిక కార్మిక శాఖ మంత్రి కి, సిపిఐ నేతలకు చర్చలు జరిగినప్పటికీ రెండు స్థానాలలో మాకు అంటే మాకే కావాలని పోటీపడ్డారు. అయితే ఆ పొత్తులు క్యాతన్ పల్లిలో సయోధ్యకు రాలేదని సమాచారం అందుకున్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు బాల్క సుమన్ నేరుగా సిపిఐ రాష్ట్ర నేతలను కలిసి చర్చలు జరిపారు. ఆ వెంటనే ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి తాము పొత్తుతో ఎన్నికల బరిలో నిలుస్తున్నామని తన వ్యూహాన్ని చక చక అమలు చేసుకున్నారు. ఇక్కడనే కాకుండా చెన్నూరులో కూడా క్యాడర్ వెంట తిరుగుతూ వారికి ఉత్సాహాన్ని నింపారు. ఈ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే సుమన్ ను పోలీసులు పదేపదే వారి



వాహనాలను వారు ఉంటున్న నివాసాలను తనిఖీలు చేస్తూ హడావుడి చేశారు. ప్రస్తుత పోలీసు నిర్బంధాన్ని ప్రశ్నిస్తూ జిల్లావ్యాప్తంగా సుమన్ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ నేతలకు ధైర్యాన్ని నింపారు. ఆ ధైర్యం వల్లనే క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జండా ఎగిరిందని కారు పార్టీ క్యాడర్ సంబరాలు చేసుకుంటుంది. చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వివేకానందపై ఇక్కడి ప్రజలు, కార్మికులు, సొంత పార్టీ నేతలు గురుగా ఉన్నారని చెప్పక తప్పదు. ఇంతకు క్రితం బీఆర్ఎస్ పార్టీ ఇతర పార్టీలలో పలు విమర్శలు ఎదుర్కొన్న నేతలు కాంగ్రెస్ పార్టీలో చొరబడి సీనియర్ నేతలను ఖాతరు చేయడం లేదని ఈ విషయాన్ని పదేపదే మంత్రికి తెలిపిన తమను పట్టించుకోవడం లేదని కొంతమంది సీనియర్ నేతలు వాపోతున్నారు. ఆ గ్రూపు రాజకీయాల వల్లనే మంత్రి ఓటమిపాలయ్యారని పరిశీలకులు భావిస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ మంత్రి సొంత నియోజకవర్గంలో కారు పార్టీ మున్సిపాలిటీ కైవసం చేసుకోవడం షాక్ అని చెప్పక తప్పదు.

## బెల్లంపల్లిలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల సమరం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీకి 34 వార్డులు ఉండగా జరిగిన ఎన్నికలలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ 14 టిఆర్ఎస్ 14 స్థానాలలో 0 వార్డు సభ్యులను విజయం వరించింది అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థులు ఐదుగురు ,బిజెపి ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రధాన పార్టీలకు సమానంగా వార్డులను గెలుచుకోగా స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు మారనున్నారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు స్వతంత్ర అభ్యర్థులతో మంతనాలను కాంగ్రెస్ పార్టీ నేతలు జరుపుతున్నారు. అయితే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచిన వారిలో కాంగ్రెస్ పార్టీ రెబెల్స్ అభ్యర్థులే ముగ్గురు ఉండడం తో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేస్తుందనే ధీమా కాంగ్రెస్ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. అయితే ఇప్పటికే క్యాంప్ రాజకీయాలకు ప్రధాన పార్టీలు మొదలు పెట్టాయి. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు ఇదివరకే క్యాంపుకు తరలి వెళ్లారు. క్యాంపు రాజకీయాలు ప్రారంభం కావడంతో ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ లు బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నాలను మొదలుపెట్టారు.

## మొయినాబాద్ మున్సిపాలిటీలో

# హంగ్

**కాంగ్రెస్ 10 వార్డులు**
**బీఆర్ఎస్ 7 వార్డులు**
**బీజేపీ 4 వార్డులు**
**స్వాతంత్రలు 5 వార్డులను కైవసం**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 26 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 10, బీఆర్ఎస్ 07, బీజేపీ 04, స్వాతంత్ర 05 వార్డులు గెలుచుకున్నాయి.

### గెలిచిన అభ్యర్థులు..

1వార్డు సదువు శ్రీలతబీఆర్ఎస్
2వ వార్డు బేగంబీ కాంగ్రెస్
3వ వార్డు బిల్లాపాటి కవితస్వతంత్ర
4వ వార్డు షాబాద్ కిషన్‌బీజేపీ
5వ వార్డు సన్వేల్లి అమరేందర్ రెడ్డి కాంగ్రెస్
6వ వార్డు ఏం.మాణిక్యంబీఆర్ఎస్
7వ వార్డు చాకలి యాదగిరి కాంగ్రెస్
8వ వార్డు మచ్చే శంకరయ్య బీఆర్ఎస్
9వ వార్డు ముదిగొండ ప్రభాకర్ యాదవ్‌బీజేపీ
10వ వార్డు పల్లగోల్ల విజయలక్ష్మి కాంగ్రెస్
11వ వార్డు పద్యపాగా మహేష్ స్వతంత్రం
12వ వార్డు అవురం విక్రం రెడ్డి కాంగ్రెస్
13వ వార్డు గడ్డం లక్ష్మీ స్వతంత్రం
14వ వార్డు కరోల్ల శ్రీధర్ బీఆర్ఎస్
15వ వార్డు అప్పాల సంధ్యాబీఆర్ఎస్
16వ వార్డు జంగం గీతావనజాక్షి కాంగ్రెస్
17వ వార్డు పాటి పావని బీఆర్ఎస్
18వ వార్డు చెగురి అరుణ కాంగ్రెస్
19వ వార్డు కళ్లెం జగపతి యాదవ్ బీజేపీ
20వ వార్డు గునుగుర్తి శిరీష బీఆర్ఎస్
21వ వార్డు జీ.అనసూయా స్వతంత్రం
22వ వార్డు గరుగు రాజు స్వతంత్రం
23వ వార్డు కె.ప్రియాంక కాంగ్రెస్
24వ వార్డు షేక్ వాజీద్ కాంగ్రెస్
25వ వార్డు దుబ్బ సోనియా కాంగ్రెస్

# జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు...

- పై చేయి సాధించిన కాంగ్రెస్
- చతికిలపడ్డ బిఆర్ఎస్
- బిజెపి అంతంత స్థానాలతో సరి
- కాంగ్రెస్ కంచుకోట ఖానాపూర్: కౌన్సిలర్ భార్గవి రాజు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో, రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జోరు కొనసాగింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలకు గాను, నాలుగు మున్సిపాలిటీలలో విజయం సాధించి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. రెండు మున్సిపాలిటీల్లో వెనుక పడడం గమనార్హం. జిల్లాలోని మొయినాబాద్, చేవెళ్ల, షాద్నగర్, శంకర్పల్లి మున్సిపాలిటీలలో అత్యధిక సీట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠం కైవసం చేసుకోగా, బిఆర్ఎస్ చతికిల పడింది జరిగింది. ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ వెనుకబడిందని, ఈ రెండు మున్సిపాలిటీలలో టిఆర్ఎస్ మెజార్టీ స్థానాలను సాధించి చైర్మన్ పీఠాన్ని అధిరోహించనుంది. ఆమనగల్లు మున్సిపాలిటీలో టిఆర్ఎస్ పార్టీ ఎనిమిది స్థానాలలో విజయం సాధించగా, బిజెపి ఆరుస్థానాలతో రెండవ స్థానంలో నిలువగా, కాంగ్రెస్ ఒక్క స్థానంతో సరి పెట్టుకుంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 13 స్థానాలలో టిఆర్ఎస్ విజయం సాధించగా, కాంగ్రెస్ ఎనిమిది వార్డులలో విజయం సాధించి రెండో స్థానాన్ని సరిపెట్టుకుంది. బిజెపి రెండు స్థానాలలో, స్వతంత్ర అభ్యర్థి ఒక్క స్థానంలో విజయం సాధించడం జరిగింది.




మరో రెండు రోజుల్లో ప్రమాణస్వీకారం...

ఈనెల 16న జరగనున్న ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎన్నికలు జరిగిన ఆరు మున్సిపాలిటీలలో నాలుగు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, రెండు స్థానాలలో బీఆర్ఎస్ గెలవడం జరిగింది. ఈ ఆరు స్థానాలలో చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

**గెలిచిన అభ్యర్థుల్లో సంతోషాలు...**

అభ్యర్థులలో ఓట్ల లెక్కింపు సమయంలో మనసులో ఆందోళనతో గుబులుగా తమ గెలుపోవటంలను దగ్గర ఉండి చూడడం జరిగింది. గెలిచిన అభ్యర్థులు సంతోషంతో రిటర్నింగ్ ఆఫీసర్ అందించిన పత్రాన్ని తీసుకొని వెళ్లగా, ఓటమి చెందిన అభ్యర్థులు దిగాలుగా వెనుతిరగడం జరిగింది. గెలిచిన అభ్యర్థి పార్టీ కార్యకర్తలు ఆనందోత్సవాలు జరుపుకోవడం జరిగింది.

**ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో....**
**కాంగ్రెస్ రెబల్స్ వలన తగ్గిన సీట్లు.....**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికలలో ఓటింగ్ శాతంలో కాంగ్రెస్ మెజార్టీ సాధించినా, అభ్యర్థుల గెలుపులో, రెబల్స్ కారణంగా ఓటమి పాలయింది. బిఆర్ఎస్ పార్టీ కంటే ఎక్కువ ఓట్లతో 45% ఓట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను సాధించుకోలేకపోయింది. కొంతమంది అభ్యర్థులు 2,3,5,6 అతి తక్కువ ఓట్ల తేడాతో 6 గురు అభ్యర్థులు ఓటమి చవిచూడాల్సి వచ్చింది. దీంతో 13 స్థానాలలో విజయం సాధించిన టిఆర్ఎస్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోనుంది. కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ కారణంగానే ఓటమి చవిచూడాల్సి వచ్చిందని, పార్టీ నాయకులు అన్నారు.

**ఖానాపూర్ లో కాంగ్రెస్ పార్టీకి జై కొట్టిన ప్రజలు....**

కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దొంతరమోని రాజు భార్గవి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికలలో ఖానాపూర్ గ్రామానికి ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2014లో అప్పటి టిఆర్ఎస్, ఇప్పటి బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ, మున్సిపాలిటీ పదవ వార్డు ఖానాపూర్ లో మాత్రం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారధ్యంలో 2014, 2020లో విజయదంక మోగించింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు, ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు జై కొట్టారు. మరోసారి మున్సిపాలిటీ ఎన్నికలలో మరొకసారి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొంతరమోని భార్గవి రాజును, కౌన్సిలర్ గా 329 భారీ మెజార్టీతో గ్రామ ప్రజలు గెలిపించడం జరిగింది. వరుసగా మూడుసార్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఖానాపూర్ ఒక ప్రత్యేకత కనబడుచుకుంది.

## మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

### సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్ లోని న్యూ గ్రీన్ సిటీ కాలనీ లో సుమారు 49 లక్షలు, గ్రీన్ సిటీ బస్సు స్టాండ్ నుండి కృష్ణ కాలనీ మెయిన్ రోడ్డు వరకు, అల్వాన్స్ నుండి మోహన్ ప్రియా అపార్ట్మెంట్స్ వరకు 15.20 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని ప్రతి డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంబడే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రేవంత్



రెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాన్నారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పార్టీ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న పలు చౌరస్తాలను


# పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

**రాజేంద్రనగర్ మహా ;** ట్రాఫిక్ కి అంతరాయం కలిగించే పలు చౌరస్తాలను రాజేంద్రనగర్ జోన్ కమిషనర్ అనురాగ్ జయంత్,తో కలిసి హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే శుక్రవారం ఆరాంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ కి అంతరాయం ఏర్పడి నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. డ్రైనేజీ, వర్షపు నీరుతో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా నూతన పైప్ లైన్ ను మెరుగుదలతో వేయించుకోవాలని అధికారులకు సూచించారు. రాందేవ్ బాబా లాగిన్ పాయింట్ వద్ద అవుట్ లైట్ పైప్ లైన్ పరిమాణం పెంచాలి. శివరాంపల్లి డౌన్ ర్యాంప్ నుండి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పిఎస్ వరకు ఫ్రీ లెఫ్ట్ రహదారి విస్తరణ చేపట్టాలి. అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణ చేపట్టాలన్నారు. బాబుల్ రెడ్డి నగర్ లోని ఎన్ పి ఏ స్కూల్



లో ఎఫ్ ఓ బిల నిర్మాణం చేపట్టాలి. మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ నుండి అరాంఘర్ వరకు రోడ్డు విస్తరణతో పాటు ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలి. పాదాచారులు క్రాసింగ్లు దాటకుండాఫ్లైఓవర్ నుండి ఆరంగర్ వరకు రౌలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బస్టాప్లను మార్చాలన్నారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



**ఆమనగల్లు, మహా :** పాఠాలు నేర్చుకునే విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి ఉపాధ్యాయులతో శభాష్ అనిపించుకున్నారు.అమనగల్లు పట్టణంలో ని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తొటి విద్యార్థులకు పాఠాలు బోధించడంతో మరిచిపోలేని అనుభూతిని పొందామని తెలిపారు. ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా, డీటిడిఓగా పూజ , ఎటిడిఓ గా రాజమ్మ, ఎచ్ ఎం గా దివ్య, ఎచ్డబ్ల్యూఓ గా రాజేశ్వరి ఉపాధ్యాయులు గా విద్యార్థులు బాధ్యతలు చేపట్టి అంతులేని ఆనందాన్ని పొందమాని చెప్పారు.ఈ సందర్భంగా ఎచ్డబ్ల్యూఓ ఎన్. గోపాల్ మాట్లాడుతూ సమయ పాలన, క్రమశిక్షణ, కార్యచరణ అలవాటవ్వాలంటే పాఠశాల స్థాయిలో జరిగే కార్యక్రమాలే కీలకం అని,పుస్తకాలను పరిశోధనాత్మకంగా పఠిస్తేనే విజ్ఞానం లభిస్తుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు, నైపుణ్యాల సాధన, నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడు ఉన్నతమైన పౌరులుగా మెలుగుతారన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులనుఅందజేశారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి...

## కాంగ్రెస్ పార్టీ కంచుకోట ఖానాపూర్: కౌన్సిలర్ భార్గవి రాజు

- ఖానాపూర్ లో కాంగ్రెస్ పార్టీకి జై కొట్టిన ప్రజలు
- ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కౌన్సిలర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి దొంతరమోని రాజు భార్గవి, తమ ప్రత్యర్థిపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికలలో ఖానాపూర్ గ్రామానికి ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2014లో అప్పటి టిఆర్ఎస్, ఇప్పటి బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ, మున్సిపాలిటీ పదవ వార్డు ఖానాపూర్ లో మాత్రం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారధ్యంలో 2014, 2020లో విజయం సాధించింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు, ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు జై కొట్టారు. మరోసారి మున్సిపాలిటీ ఎన్నికలలో మరొకసారి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొంతరమోని భార్గవి రాజును, కౌన్సిలర్ గా 329 భారీ మెజార్టీతో గ్రామ ప్రజలు గెలిపించడం జరిగింది. వరుసగా మూడుసార్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఖానాపూర్ ఒక ప్రత్యేకత సాధించుకుంది. పదో వార్డు కౌన్సిలర్ గా భార్గవి రాజును భారీ మెజార్టీతో గెలిపించిన సందర్భంగా, ఖానాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.



## మంచిర్యాల జిల్లాలో ఒకటి మినహా

# 4 మున్సిపాలిటీలు కైవసం

### ఆనందంలో మంచిర్యాల కాంగ్రెస్ నేతలు

మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లాలో శుక్రవారం ప్రకటించిన మున్సిపాలిటీలలో ఒకటి మినహా 4 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ క్లీన్ చిట్ చేయాలని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు భావించినప్పటికీ కేవలం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాత్రమే తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్ లో 60 ఉండగా అందులో 44 స్థానాలను అధికార పార్టీ గెలుచుకుంది. ఇకపోతే మిగిలిన స్థానాలు బీఆర్ఎస్8, భాజపా5, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 2, జనసేన 1 కార్పొరేటర్ గా గెలుపొందారు.

లక్షెట్టిపేట మునిసిపాలిటీలో 15 కౌన్సిలర్ స్థానాలకు కాను 11 అధికార కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. మిగిలిన నాలుగు స్థానాలలో బీఆర్ఎస్3, బిజెపి1 లలో గెలిచారు. ఇకపోతే చెన్నూరు నియోజకవర్గంలో చెన్నూరులో మొత్తం స్థానాలు 18 ఉన్నాయి. అందులో 11 కౌన్సిలర్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, మిగిలిన ఏడు కౌన్సిలర్లను బీఆర్ఎస్4, బీజేపీ2, ఇండిపెండెంట్ 1గెలుచుకున్నాయి. క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు అధికార కాంగ్రెస్ పార్టీ పోటీ చేయగా అందులో కేవలం7 మాత్రమే గెలిచి వెనుకబడిపోయింది. ఇక్కడ ప్రతిపక్ష పార్టీ భారత రాష్ట్ర సమితి 10 స్థానాలు, దాని మిత్రపక్షం సిపిఐ 4 స్థానాలు, బిజెపి1 అధికార పార్టీకి సవాలు విసిరింది. ఈ ఫలితాలు ఇలా రావడం పట్ల మంత్రి గడ్డం వివేకానంద అధిష్టానాన్ని సంతృప్తి పరుస్తారో చూడాల్సిందే. ఇకపోతే బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒకే ఒక్క మున్సిపాలిటీ ఉండగా

**అక్కడ భారత రాష్ట్ర సమితి తీవ్ర పోటీని ఇచ్చింది. అక్కడి**

మున్సిపాలిటీలలో 34 కౌన్సిలర్ స్థానాలు ఉండగా కాంగ్రెస్ కు 14, బీఆర్ఎస్ కు14, సంస్థానాలు రాగా స్వతంత్ర అభ్యర్థులు 5, బాజాపా ఒకటి స్థానాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం బెల్లంపల్లి కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు శిబిరాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ శిబిరానికి స్వతంత్ర అభ్యర్థులను తరలించేందుకు మంతనాలు సాగుతున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఏది ఏమైనప్పటికీ గడ్డం ఫ్యామిలీ మున్సిపాలిటీ ఎన్నికలలో వ్యూహరచన చేయడంలో వెనుక పడ్డట్టే కనిపిస్తోంది.

## ఆమనగల్లు మున్సిపాలిటీ

# బీఆర్ఎస్ కైవసం

### చైర్మన్ పిఠాన్ని దక్కించుకున్న బిఆర్ఎస్

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు చొప్పున బిఆర్ఎస్ 8 స్థానాలు,6 స్థానాల్లో బీజేపీ, 1 స్థానం లో కాంగ్రెస్ విజయం సాధించారు. దీంతో బిఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది.

**గెలిచినా అభ్యర్థుల వారిగా వివరాలు**

1వ వార్డు జటవత్ ధోలిబీజేపీ
2వ వార్డు కాలే యశోదమ్మబిఆర్ఎస్
3వ వార్డు తల్లోజు గీతబీజేపీ
4వ వార్డు దుడ్డు ఆంజనేయులుబిఆర్ఎస్
5వ వార్డు పాపిశెట్టి రాముబిఆర్ఎస్
6వ వార్డు పత్య నాయక్‌బిఆర్ఎస్
7వ వార్డు నేనావత్ నిరంజన్‌బీజేపీ
8వ వార్డు ఏనుమల రమేష్‌బిఆర్ఎస్
9వ వార్డు ఎర్రవోలు మహేష్‌బీజేపీ
10వ వార్డు కోగురు అనిత శ్రీనివాస్ రెడ్డికాంగ్రెస్
11వ వార్డు నేనావత్ సునీత ప్రశాంత్‌బీజేపీ
12వ వార్డు నాగిళ్ళ జంగయ్యబిఆర్ఎస్
13వ వార్డు పుల్లారెడ్డి అనూష శ్రీశైలంబిఆర్ఎస్
14వ వార్డు మొక్తల వెంకటయ్యబీజేపీ
15వ వార్డు ఎంగలి భాగ్యలక్ష్మి రఘు బిఆర్ఎస్

## తెలంగాణలో లేబర్ కోడ్‌లు అమలు చెయ్యబోమని

# అసెంబ్లీలో తీర్మానం చేయాలి

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య డిమాండ్



**రాజేంద్రనగర్ మహా ;** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య తెలంగాణ అసెంబ్లీలో కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయకూడదని తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.కాటేదాన్ డివిజన్ పరిధిలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలు, రైతులు, కార్మికులపై యుద్ధం ప్రకటించిందని ఆరోపించారు. వందల ఏళ్ల పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి నోటిఫికేషన్ జారీ చేయడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్-2020: ట్రేడ్ యూనియన్ చట్టం-1926, పారిశ్రామిక వివాదాల చట్టం-1947, స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం-1946లను రద్దు చేసింది.సామాజిక భద్రతా కోడ్, ఉద్యోగుల బీమా, భవిష్యనిధి, ప్రసూతి చట్టం, గ్రాట్యుటీ చట్టాలను కలిపి ఐచ్ఛికంగా మార్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఆక్యుపేషనల్ సేఫ్టీ కోడ్-2020, ఫ్యాక్టరీ చట్టం-1948 సహా 13 చట్టాలను రద్దు చేసి, ఇన్స్పెక్టర్ కమ్ ఫెసిలిటేటర్ వ్యవస్థతో కార్మిక శాఖను యాజమాన్యాల సేవకుడిగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు-2025, కొత్త విత్తన బిల్లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణలు,ప్రజా సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు. దేశవ్యాప్త సమ్మెకు రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ సంఘాలు మద్దతిచ్చాయన్నారు.కేరళ ప్రభుత్వం లేబర్ కోడ్ లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసినట్టు గుర్తుచేస్తూ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మాదిరిగా తీర్మానం చేసి కార్మికుల హక్కులను కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.కార్మికులందరి ఐక్యతతోకేంద్ర వ్యతిరేక విధానాలను ఓడిస్తామని సిఐటియు నేతలు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు కాలే రాజు, చుక్క మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ఎన్నికల

# కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్


**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయగా శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులను ఫలితాలు వెల్లడితోపాటు కౌంటింగ్ కేంద్రం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నిబంధనలను తప్పకుండా మేరకు నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ ,బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ లు పాల్గొన్నారు.



# లీలావతి వినోదం

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సతీ లీలావతి'. నాగ మోహన్ నిర్మించిన ఈ సినిమా మార్చి 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ–"'సతీ లీలావతి' సినిమా ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. మూడు నెలల్లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేశాం.

దర్శక–నిర్మాతల సపోర్ట్ వల్లే ఇది సాధ్యమైంది. పూర్తి వినోదాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. "కమల్‌హాసన్‌గారి 'సతీ లీలావతి' చిత్రంతో నా సినిమాను పోల్చను. కానీ ప్రేక్షకులందరూ రిలేట్ అయ్యేలా మా సినిమాను తీశాం" అని చెప్పారు తాతినేని సత్య. "ఇది నా తొలి చిత్రం. ఈ సినిమా ప్రయాణంలో నేను ఎన్నో నేర్చుకున్నాను" అని చెప్పారు నాగ మోహన్. నటుడు సప్తగిరి మాట్లాడారు.



# చాన్నాళ్ల తర్వాత జీవాకి సక్సెస్..

టాలీవుడ్ సంగతి కాస్త పక్కనబెడితే తమిళంలో ఈసారి సంక్రాంతికి ఊహించన విషయాలు చాలా జరిగాయి. దళపతి విజయ్ 'జన నాయగణ్' మూవీ.. సెన్సార్ సమస్యలతో వాయిదా పడింది. శివకార్తికేయన్ 'పరాశక్తి' మెప్పించలేకపోయింది. కార్తీ 'వా వాతియర్' అట్టర్ ఫ్లాప్ అయింది. చివరి నిమిషంలో హడావుడిగా పండగ బరిలో నిలిచిన హీరో జీవా నటించిన 'తలైవర్ తంబి తలైమయిల్' అనే కామెడీ సినిమా హిట్ అయిపోయింది. ఇది ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసింది. తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ ఎలా ఉందనేది ఇప్పుడు రివ్యూలో చూద్దాం.

## కథేంటి?


జీవారత్నం (జీవా) ఓ పల్లెటూరికి సర్పంచ్. అందరికీ చేదోడు వాదోడులా ఉంటాడు. ఓ రోజు తన ఊరికి చెందిన ఇళవరసు (ఇళవరసు) కూతురు సౌజన్య (ప్రార్థన నాథన్) పెళ్లి దగ్గరుండి జరిపించే బాధ్యతని తీసుకుంటాడు. ఉదయమే శుభకార్యం అనగా పక్కింట్లో ఓ ముసలాడు చనిపోతాడు. ఓవైపు పెళ్లిసందడి, మరోవైపు చావు విషాదం. ఈ రెండిళ్ల మధ్య ఎలాంటి గందరగోళం ఏర్పడింది? జీవా ఈ సమస్యని ఎలా పరిష్కరించాడు? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.

## ఎలా ఉందంటే?

సింపుల్ కాన్సెప్ట్, పరిస్థితులకు తగ్గట్లు వచ్చే కామెడీతో మలయాళంలో ఎక్కువగా సినిమాలు తీస్తుంటారు. దాదాపు ఇదే టెంప్లేట్‌తో వచ్చిన తమిళ మూవీ 'తలైవర్ తంబి తలైమయిల్'. ఓ పల్లెటూరు, ఓ సర్పంచ్, ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ, ఓ పెళ్లి, ఓ చావు.. వీటన్నింటి నుంచి పుట్టుకొచ్చే కామెడీతో ఈ సినిమా తీశారు. పల్లెటూళ్లలో పంతాలు పట్టింపులు లాంటివి ఎక్కువగా కనిపిస్తుంటాయి. అలా ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే గొడవ కాస్త.. ఊరిలో విధ్వంసానికి ఎలా కారణమైంది అనే విషయాన్ని చాలా సరదాగా, కామెడీగా ఇందులో చూపించారు. రెండు గంటల్లోపే ఉండే ఈ మూవీ అక్కడక్కడ బోర్ కొట్టినప్పటికీ.. ఓవరాల్‌గా పర్లేదు బానే ఉందనిపించేలా సాగుతుంది.

మూవీ ప్రారంభ సన్నివేశంలో ఓ వ్యక్తిని పిచ్చోడు అని ఊరి మొత్తం అంటుంది. జీవా కూడా మనసులో అలానే అనుకుంటాడు. కానీ చివరకొచ్చేసరికి అతడు తప్పితే ఊరంతా పిచ్చోళ్లే అనే విషయాన్ని జీవా అర్థం చేసుకుంటాడు. ఇదే అంశాన్ని చూపించిన విధానం బాగుంది. పాత్రలన్నీ కూడా ఎక్కడా అతిగా ప్రవర్తించవు. పరిస్థితులకు తగ్గట్లే అలా అలా వెళ్లిపోతాయి. ఓ సర్పంచ్, ఇద్దరు వయసైన వ్యక్తులు, ఓ ముసలాడు, ఓ పెళ్లి కూతురు, ఓ పెళ్లి కొడుకు.. చివరకు ఊరిలోని వాటర్ ట్యాంక్‌ని కూడా కథలో భాగం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. సర్పంచ్ పాత్రలో జీవా ఆకట్టుకోగా.. ఇళవరసు, తంబి రామయ్య కూడా మెప్పించాడు. పెళ్లి కూతురిగా ప్రార్థన నాథన్ క్యూట్‌గా చేసింది. మిగతా పాత్రధారులు తమకిచ్చిన రోల్స్‌కి న్యాయం చేశారు. టెక్నికల్ అంశాలకొస్తే సినిమాటోగ్రఫీ బాగుంది. పాటలు పెద్దగా గుర్తుండవు గానీ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ సరదాగా సాగిపోయింది. నితీశ్ సహదేవ్ దర్శకుడిగా మెప్పించాడు. తెలుగు డబ్బింగ్ బాగా కుదిరింది. ఈ వీకెండ్ ఏదైనా సరదాగా సాగిపోయే ఓ కామెడీ సినిమా చూద్దామనుకుంటే 'తలైవర్ తంబి తలైమయిల్'పై ఓ లుక్కేయొచ్చు. కుటుంబంతోనూ కలిసి చూడొచ్చు. ఎలాంటి అభ్యంతరకర సీన్స్ లేవు.







# ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ మూవీ..

## కాంతార బ్యూటీకి కలిసొచ్చేనా?

కన్నడ బ్యూటీలకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. రష్మిక, శ్రీలీలకు ఇప్పటికే తెలుగులో స్టార్ హీరోయిన్లుగా తమ పేరును లిఖించుకున్నారు. పుష్ప మూవీతో రష్మిక మందన్నా రేంజ్ పూర్తిగా మారిపోయింది. అలా కన్నడ భామలు ఇలా వచ్చి తెలుగులో సూపర్ పవర్‌గా ఎదిగారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో తెలుగమ్మాయిల కంటే శాండల్‌వుడ్ భామలకే ఫుల్ డిమాండ్ ఉంటోంది. ఇప్పుడదే అదే బాటలో మరో కన్నడ బ్యూటీ అడుగులేస్తోంది. గతేడాది కాంతార 2 మూవీతో అందరి చూపులు తనవైపు తిప్పుకున్న భామ రుక్మిణి వసంత్. ఇప్పుడు టాలీవుడ్‌పై దృష్టి సారించింది. సప్త సాగరాలు దాటి లాంటి కన్నడ మూవీతో సూపర్ హిట్ కొట్టిన ముద్దుగుమ్మ.. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఛాన్స్ కొట్టేసింది. ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ కాంబోలో వస్తోన్న చిత్రంలో అవకాశం దక్కించుకుని టాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ కాంబోలో వస్తోన్న చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ విషయాన్ని మేకర్స్ కూడా అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీతోనైనా రుక్మిణి వసంత్ టాలీవుడ్‌లో క్రేజ్ దక్కించుకుంటుందేమో వేచి చూడాల్సిందే. రష్మిక, శ్రీలీల మాదిరిగానే ఈ ముద్దుగుమ్మకు టాలీవుడ్‌లో స్టార్‌గా హోదాను సొంతం చేసుకోవాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లోనూ తన కెరీర్‌ను సక్సెస్‌ఫుల్‌గా ముందుకు తీసుకెళ్తుందని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. రుక్మిణి వసంత్ ఇప్పటికే తెలుగులో నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వచ్చిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో చిత్రంలో నటించింది.

# చికిరి చికిరి హుక్ స్టెప్ వెనకాల రామ్‌చరణ్: జానీ మాస్టర్





గతేడాది బాగా హిట్టయిన సాంగ్స్‌లో 'చికిరి చికిరి' ఒకటి. ఇందులో రామ్‌చరణ్ డ్యాన్స్ స్టెప్స్ బాగా వైరలయ్యాయి. ఆ పాట రిలీజైన తర్వాత సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆ హుక్ స్టెప్ క్రియేట్ చేసిన వీడియోలే దర్శనమిచ్చాయి. సినిమాకు మంచి హైప్ తీసుకువచ్చిన ఈ పాటను ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేయగా మోహిత్ చౌహాన్ ఆలపించాడు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు.

## కంపోజ్ ఎవరు చేశారంటే?

తాజాగా జానీ మాస్టర్ ఓ డ్యాన్స్ షోలో ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. కూర్చుని లేసే స్టెప్స్ తాను కంపోజ్ చేశానని.. కానీ, క్రికెట్ బ్యాట్ స్టెప్ మాత్రం చరణ్ కంపోజ్ చేశాడని తెలిపాడు. జానీ మాట్లాడుతూ.. హుక్ స్టెప్ చరణ్ అన్న వేరేలా కంపోజ్ చేశారు. బ్యాట్ స్టెప్, దాన్ని పట్టుకునేముందు వచ్చే డ్యాన్స్ స్టెప్ ఆయనే క్రియేట్ చేశారు. ఏరోజూ ఆయన క్రెడిట్ తీసుకోరు, మనకే ఇచ్చేస్తారు.

## సినిమా

ఎందుకలా అని అడిగితే.. ఐడియా నాది, కానీ దాన్ని ఇంకాస్త బెటర్‌గా మార్చి.. ఇది వర్కవుట్ అవుతుందని నమ్మినందుకు ఆ క్రెడిట్ మీకే చెందాలి అన్నారు. రామ్‌చరణ్ విషయానికి వస్తే.. ఆయన చివరగా నటించిన గేమ్ ఛేంజర్ డిజాస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం పెద్ది అనే స్పోర్ట్స్ డ్రామా మూవీలో యాక్ట్ చేస్తున్నాడు. జాన్వీ కపూర్ కథానాయిక. బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

# రెండున్నరేళ్లు గడిచిపోయాయి..



ఎంత పెద్ద స్టార్ హీరో అయినా సరే కొన్నిసార్లు సినిమా కష్టాలు తప్పవు. చిరంజీవి 'విశ్వంభర' సరిగ్గా ఇలాంటి స్థితిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ మూవీ ఒకటుందని జనాలు ఇప్పటికే మర్చిపోయారు. మూవీ టీమ్ నుంచి కూడా ఎలాంటి అప్‌డేట్ లేదు. అసలు ఈ చిత్రం ఈ ఏడాదైనా రిలీజ్ అవుతుందా? ఇంతకీ అసలేం జరుగుతోంది? 'బింబిసార' లాంటి సక్సెస్ తర్వాత వశిష్ఠ.. చిరంజీవితో కలిసి కొత్త మూవీ చేసేందుకు సిద్ధమయ్యాడు. 2023లో చిరు పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్టుని ప్రకటించారు. అక్టోబరు నుంచి షూటింగ్ కూడా మొదలుపెట్టారు. 2024లో ఎప్పుడైతే గ్లింప్స్ పేరిట ఓ వీడియో వదిలారో అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. గ్లింప్స్‌పై విపరీతమైన ట్రోలింగ్, విమర్శలు వచ్చాయి. దెబ్బకు మూవీ టీమ్‌కి సీన్ అర్థమైపోయింది. గతేడాది ఓ పాట, కొత్త గ్లింప్స్ అని మరికొన్ని అప్‌డేట్స్ వచ్చాయి గానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. బజ్ రాలేదు. మరోవైపు దీని తర్వాత చాన్నాళ్లకు అనిల్ రావిపూడితో చిరంజీవి ఓ సినిమా ప్రకటించారు. 'మన శంకరవరప్రసాద్' పేరుతో గత నెలలో సంక్రాంతికి రిలీజ్ చేస్తే అద్భుతమైన హిట్ కొట్టింది. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో కొత్త మూవీ చేసేందుకు చిరు రెడీ అయిపోతున్నారు. మెగా ఫ్యాన్స్ కొత్త ప్రాజెక్టు గురించి ఆనందపడిపోతున్నారు. దీని గురించి రూమర్స్ చాలానే వస్తున్నాయి. ఇది కూడా వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా తీస్తున్నారని అంటున్నారు. అదే టైంలో 'విశ్వంభర' గురించి చిన్న సౌండ్ కూడా లేదు. తాజాగా 'విశ్వంభర' నిర్మాతలే తీసిన 'కపుల్ ఫ్రెండ్లీ' విడుదల సందర్భంగా నిర్మాతలు.. చిరు సినిమా గురించి మాట్లాడట్లేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' టీమ్‌తో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు వశిష్ఠ కూడా 'విశ్వంభర' రిలీజ్ గురించి త్వరలో చెబుతాం అంటున్నాడే తప్ప ఈ ఏడాది వస్తుందా కనీసం వచ్చే ఏడాది వస్తుందా లాంటివి క్లారిటీ ఇవ్వట్లేదు. చూస్తుంటే గ్రాఫిక్స్ విషయంలో ఇంకా సందిగ్ధత అలానే కొనసాగుతున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. ఆ రిపేర్లు ఎప్పుడు పూర్తవుతాయో? బొమ్మ ఎప్పుడు బయటకు వస్తుందనేది అంతుచిక్కని ప్రశ్నలా మారిపోయింది?

# రూ.45 కోట్లకు రూ.1 లక్ష రాలే..



కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలుస్తాయి. అలాంటి డిజాస్టరే అందుకుంది 2023లో వచ్చిన "ది లేడీ కిల్లర్". ఈ సినిమా వైఫల్యం గురించి తాజాగా స్పందించింది హీరోయిన్ భూమి పెడ్నేకర్. దల్‌దల్ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా మిడ్‌డేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భూమి పెడ్నేకర్ మాట్లాడుతూ.. నాకు ఇచ్చిన స్క్రిప్ట్ పరిపూర్ణంగా ఉంది. కానీ, అందులో చాలా భాగాన్ని తెరకెక్కించలేదు.

## ముందే తెలిసుంటే బాగుండు

అసంపూర్తిగానే సినిమా రిలీజ్ చేశారు. ఇది నాకు ముందే తెలిసుంటే బాగుండేది. నేను కూడా మేకింగ్‌లో భాగమై ఉంటే కొన్ని విషయాలను మార్చగలిగేదాన్ని. అయినా జరిగినదానికి నేను షాక్‌లోనే ఉన్నాను. ఎందుకంటే గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. కాబట్టి ఈ సినిమా పరిస్థితేంటా? అని భయపడ్డాను. చివరకు ఇది ఒక గుణపాఠం అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను.

## సినిమా షూట్ అవలేదు

దాదాపు 35% సినిమా షూట్ చేయనేలేదు. అయినా రిలీజ్ చేశారు. అది నా జీవితంలోనే ఎంతో బాధాకరమైన విషయం. ఈ సినిమాకిలా జరగడం నన్ను ఎంతగానో కలిచివేసింది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నన్ను చాలా బాధపెట్టింది. ఇక నా పనైపోయిందనుకున్నాను. అసలు దానికి బాధ్యులెవరన్నది ఇప్పటికీ నాకర్థం కాదు అని భూమి పెడ్నేకర్ చెప్పుకొచ్చింది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034